ఓం

శ్రీ గురుభ్యోన్నమః

# గజేంద్రమోక్షణ హరికథ

My Grand Fathers Mother
(గ్రంథకర్త),
My Mothers Grand Ma


డబీరు కాంతారత్నము

జలుమూరు.



చైతాంగ ముద్రణాలయము
శ్రీకాకుళం.
1940

వెల రు. 0—4—0

ఓం

శ్రీ గురుభ్యోనమః

# గజేంద్రమోక్షణ హరికథ

---

గ్రంథకర్త్రి,


డబీరు కాంతారత్నము
జలుమూరు.


---


ప్రథమ ముద్రణము
500 ప్రతులు.

రైతాంగ ముద్రణాలయము
శ్రీకాకుళం.
1940



(గ్రంథస్వామ్యములు గ్రంథకర్త్రివి.)

వెల రు. 0—4—0

# భక్త్యాంజలి

వేదాంత కళాప్రవీణయు సుగుణమణి భూషణియు విమలకీర్తి పరివేషిణియు సృష్టికరణ కులాలంకారిణియు మృదు భాషిణియు నాపినతల్లియునగు శ్రీమతి బాసూర లక్ష్మి నరసమాంబ చరణసరోరుహములకు వినయవినమితగాత్రినై భక్త్యాంజలినొనర్తును.

గ్రంథకర్త్రి

# కృతిసమర్పణ

భూభారంబునడంప సాధుజనులన్ బోషింప క్ష్మామండలిన్
శోభాపూర్ణమనోజ్ఞమూర్తియయితోచున్ నెవ్వఁడావిష్ణు సే
వాభాగ్యంబునుగోరి యీకృతిని నే భక్త్యాత్మనై వానికిన్
శోభిల్లంగనొసంగి ధన్యనగుదున్ క్షోణీస్థలిన్నెంతయున్ ॥

కృతికర్త్రి

శ్రీ ఓం శ్రీ

శ్రీగురు పరబ్రహ్మణేనమః

# గజేంద్రమోక్షణ హరికథ.

శ్రీనిత్యంబును నంకపీఠికను భాసిల్లంగ భవాబ్ధిసనా
సీనుండై భువనత్రయీభరణముంజేయంగ నూహించు ల
క్ష్మీనాథుండు యనాథరక్షకుఁడు నాచేమోడ్పులన్ నందివి
న్నాణంబేర్పడఁబ్రోచుఁగాఁతనను స్వాంతంబందు
వర్తించుచున్ ॥

సీ॥ పార్వతీపుత్ర నిన్ బ్రార్థించెదను సదా
విఘ్నాపహారివై వెలయుదనుచు
సజురాణినిన్ను నేనతిభక్తిమ్రొక్కెద
విమలవాగ్గుంభన మమరుననుచు
కాత్యాయనీ నిన్ను గడువేడ్కసేవింతు
గారాబమున నన్ను గాతువనుచు
నిందిరాదేవి నిన్నుంబొందఁగొల్చెద
నతులసంపదలు నాకబ్బుననుచు

గీ॥ ననిశముఁదలంచి నుతియింతు వ్యాసకాళి
దాస నన్నయముఖకవి తతిని, మదిని
సకలవిదుషీమతల్లుల చరణములను
గీలుకొల్పి సేవింతు నక్షీణభక్తి॥

గీ॥ ధాత్రి నుప్పాడవంశ దుగ్ధాబ్ధి చంద్రుఁ
డలఘు తేజుఁడు భూరి విద్యాప్రపూర్ణుఁ
డార్యవినుతుఁడు రాజరాయాభిధానుఁ
డైన మద్గురుఁగొల్తు కృత్యాది నెదను॥

(తోహరాలు)

1. కరి విభుమోక్షణ కథఁదెల్పెదనే । వరజనులారా వినుడు
పరాత్పరునిఁగని తరియించిన ఘన । వర్తనంబు వినిమనుడు
2. జ్ఞానవిహీనను యబలనుభువిలో । శాస్త్రవిధులను నెరుంగ
మానవతీమణినై నేఁదెల్పెద । మాన్యహృదయ మలరంగ
3. ఆర్యులార నానేర్పునఁజెప్పెద । నతిసాహసమునుబూని
కార్యమందు నేతప్పులుగల్గిన । క్షమియించుడు కృపనూని॥

వ॥ పూర్వకాలంబున నుత్తరానందనునిఁ గని వ్యాసపుత్రుం
డిట్లనియె.

సీ॥ రాణ్మణిపాలసంద్రమునందు మును త్రికూ
టంబను శైలరాజంబుగలదు
భర్మరజత యయోమయములై విలసిల్లు
శృంగత్రయంబు చెలంగుచుండు



యోజనదీర్ఘంబు రాజిలునంతయె
వెడలుపుఁగలిగి యెయ్యెడనుఁగనిన
దరులు పల్లవపుష్పతరు వితానంబున
శోభిల్లునందు వల్లభులఁగూడి

గీ॥ భిల్లగంధర్వదేవతా పల్లవాధ
రప్రతతి విహరించు నిరంతరంబు
సకల రత్నాశ్రయంబు బ్రశస్తమాని
వర్గసముపేతమై కడు వరలుమరియు॥

వ॥ గిరీంద్రంబునాఁబఱఁగునయ్యద్రి వటకుటజాశ్వత్థపనస బదరీ జంబూచందన మందారాది విశాలాశాంతరాళ సంవ్యాప్తవృక్షరాజంబులును మాలతీమేలాలవంగాది మనోహర వల్లరీనివహంబును నిరంతరప్రవాహ సముద్భవ ఝర్ఝరీనినదపూరిత గహనతలంబులగు సెలయేళ్లును బకబలాకజలకుక్కుటమరాళప్రముఖ జలవిహంగ సమాశ్రితంబులును నక్రకమఠకర్కటమీనాది జలచర యుక్తంబులునగు సరోవరంబులును కలకంఠనీలకంఠ శుకశారికాకాకఘూకాది పతంగసంకులంబును మృగేంద్రకరీంద్ర శరభశార్దూల భల్లూక వరాహ జంబుకముఖ వన్యమృగసందోహంబును గలిగి

తో॥ ఒప్పారెడి నాగిరీంద్రముందున । నుత్సవంబు మీరగను
తప్పక నిత్యము యక్షగరుడగం । ధర్వమిథునములువగను
సరసనవ్యగీతాలాపనములు । సంభాషణములు సెలఁగ
దరహసితంబగు ముఖపద్మంబులఁ । దనరుచు ముదమున

మెలఁగ

వ॥ అందు నొకలావణ్యపరిదేశమునఁ గొందరు యక్షకాంతలు
చంద్రికాంత శిలాసీనలై పరమేశ్వరుని మహిమలు వర్ణించు
గీతములు విపంచీస్వనంబున మేళవించి

కల్యాణి—చతురశ్రజాతి.

నీమహిమలు వర్ణింపఁగఁదరమా॥నీ॥
కోమలాంగ మునికుంజరపోషక
మామనోహరా మదనసుందరా॥నీ॥
భూతజాలమును భువిసృజియింపఁగ
ధాతరూపమునఁ దనరుదు వరయఁగ॥నీ॥
సచరాచరముల సత్కృపమనుపఁగ
నచలధారి వీవాధ్యుఁడ వనిశము॥నీ॥
లయకారుఁడవై వెలయుదువిలమను
నయఁగనుమా దురితహారి శ్రీహరి॥నీ॥

వ॥ మరియు నొక లావణ్యవతి వీణాపాణియై వాక్పతిన్దల
పించుచు

జంఝూటి—చతురశ్రగతి

ఓదేవా సుకుమారసుందరా ॥ఓ॥
నీదయలేదా బ్రోవఁగరావా
మోచముఁగూర్పవ సాధులబ్రోచిన ॥ఓదే॥
అందముగల నీపదయుగ్మమునన్
డెందమునుంచి నుతించెదరవిన్నటు ॥ఓదే॥



కోమలమగు నీశ్యామల దేహము
తామరసాక్షా కృపతోఁజూపుము ॥ఓదే॥
ఘోరభవములను బారఁదోలనిటు
చేరఁగవచ్చి నానేరములెన్నకు ॥ఓదే॥
ఎన్నిజన్మముల నెత్తిననైనా
సన్నుతాంగ నీ స్మరణనొసంగుము ॥ఓదే॥

వ॥ మరియు రమణీయంబగు నవరత్నఖచిత విమానారూఢులై
విహరించు కిన్నరదంపతులందందు వనశృంగారంబునుఁ
జూచుచుండు నందు వినోదార్థ మొకప్రియుఁడు ప్రేయసిని
జూచి వనలావణ్యమును వర్ణింపఁదొడఁగె

కల్యాణి—ఏకతాళము

కనుమా చెలి యీ వనసౌభగమును ॥కను॥
మనములరఁగ చందనవృక్షములను
ఘనమగు జంబూ పనస వకుళములు ॥కను॥
ఆలరెడు నర్జున భల్లాతకవట
ఫలరసాల హింతాల సాలత
క్కోల పరళ బదరీ లవంగ వర
తాళ చూతమందారభూజములు ॥కను॥
అల్లిబిల్లిగను నల్లిన మాలతి
మల్లిమాధవీ మరివిరజాజుల
ఫుల్లకుసుమ మధు వెల్లఁగ్రోలిలి కడు
నుల్లసిల్లు తేంట్లల్లవె వేడుక ॥కను॥

తో॥ ఇటులఁబల్కి ప్రియనాథునితోడను నేణనేత్రి
యిట్టులనియె
పటుతరమగు వైరంబులుమానుచు వన్యమృగంబులు మనియె
నురుమోదంబున సంచరించుటలు నూహింపఁగఁ జిత్తమున
వరగుణయెంతో యబ్బురమొదవెను బరికింపుము మోదమున

శ్రీ రాగము — ఖండజాతి ఆదితాళము

పల్లవి — చూడుమోనాథా ॥చూ॥
అ॥ ప॥ కడుముదమున ఘోర కాననసీమలో పడుచు లేచి
పైకిబ్రాకెడు కోతులను ॥చూ॥
చర॥ కరులనుగూడి కేసరులుమెలంగుటబ్బురము మృగము
లు బెబ్బులులఁగూడి ముదమ లరగతిరిగెడు వా లముల
ద్రిప్పి శ్రిమను, శరభములకుఁ బాపు చమరీమృగం
బులు ॥చూ॥
తో॥ పతికినినాథుఁడు ప్రియమునఁదెల్పెను సతివరో వినినా
నుడిని
మతినిడవే నేనార్యులుదెల్పిన మాటలు జెప్పెదవడిని
దేవమునులు యీవనమందున మునుదీక్షఁదపముసేయఁగను
భావించి మృగావళివైరంబును బరికించుచు నెవ్వగను
సీ॥ తమచెంగటికి మృగతతినెల్లరావించి
యెలమినవ్వాని శాసించిరిటుల
జాతివైరంబులెచ్చుటను బూనఁగఁబోక
మీరలిచ్చోటను మెలఁగుడనుచు
దానినివిని జంతుతతి క్రౌర్యమునువీడి
సత్త్వవృత్తినిఁదాల్చి సంతతమును



మునులవాక్యంబు లమోఘంబులని యెంచి
మెలఁగుచునుండును జెలువుమీర
గీ॥ చాన! యదిమొదలిటుల నీకాననమున
శరభశార్దూల హరిణాది జంతుసమితి
సోదరులలీల మెలఁగును చోద్యముగను
గాన! ధనముకన్నను తపోధనము ఘనము॥

పంచచామరము.

అనంగ నాథుఁగాంచి సుందరాంగి హర్షభాష్పయై
మనోహరా! మనోజ్ఞ పుష్పమండితంబులైన యీ
వనంబుఁగాంచి ధన్యనైతి వారిజప్రసూతుఁడెం
తనైపుణిన్ సృజించెనొక్కొ! ధాత్రినీవనస్థలిన్॥
వ॥ నాథా! చిత్రగిరి పార్శ్వారణ్యంబమిత సాంద్రంబై లతా
గుల్మాదులతో నొప్పారుచుండ నిద్దానివర్ణించుట ధాతకై
నను శక్యమగునా? ఆహా! యెంతరమణీయము, యెంత
వినోదకరము. ఇట్టి మనోహర కాంతారంబును సృజించు
టకు విధాత యెన్నియుగములు శ్రమపడెనో కదా! చూచె
డు కాలమే వసంతకాలమనఁబడును. ఋతుషట్క ధర్మం
బులన్నియు నిచ్చో నొక్కమ్మడిగా రాణించుచున్నయవి.

నాథనామక్రియ — ఆదితాళము

వనసీమన్ యిఁకఁగనఁదరమా నామనమున కతివేడుక
గూర్చెడు యీ ॥వన॥
కీరశారికా కేకీకోకిల వరనినదంబుల కరమలరారెడి ॥వన॥
హరులు వ్యాఘ్రములు బోరిపోరి దిరిగెడు
కరిసముదాయముగన గిరులనఁబడు ॥వన॥

సరసిజ శోభిత జలజాకరములు
పరికింపఁగ నబ్బురమొనఁగూర్చెడి ॥వన॥

వ॥ అని వేడుకతోఁ గ్రీడింతునట్టి ఘనకాంతారంబున నేనుఁగు
గున్నలనేకము లెక్కకుమించి చిత్రగిరి గుహలలో డాగి
సంధ్యాకాలంబున వెలువడు పెంజీకటులంబలె గుహలు
వెడలి విహరించుచుండె నెట్లన

గీ॥ అద్రిగుహలందు బవలెల్ల నణఁగియుండి
సాంధ్యరాగంబు దిశల నెసంగునంత
నంధకారంబు వెల్వడునటుల చటుల
కుంభినివహంబు వెల్వడు గుహలనుండి॥

వ॥ ఇట్లు కరిసముదాయంబు గుహలు వెడలునపుడు

సీ॥ గజబృంహితంబులు కర్ణద్వయిని సోక
సింగపుఁగొదమలు సెందుభయము
బెబ్బులులెల్లెడ భీతితోఁ బారును
భల్లుకంబులు గుహావళినిఁ దూరు
మహిషముల్ బెగడొంది మడుఁగులఁ జేరును
హరిణముల్ కంపించి గిరుల జిక్క
బర్హిసంఘము లభ్రపథమున కేగును
ఘనవృక్షములఁ జేరు వనచరాళి

గీ॥ భూబిలంబుల డాగును భోగికులము
కోకములు భీతితోడ నొక్కుమ్మడిఁ జను
ధరణికంపించు దిక్కులు దద్దరిల్లు
రాజిలకరీంద్రు వనవిహారంబునందు॥



వ॥ ఈవిధంబున గజేంద్రుఁడు తనసతులతో విహరించుచు
స్వేచ్ఛమై మెలఁగుచుండునట్టి యవసరంబున

సీ॥ పల్లవంబులు లేత పచ్చికయునుఁ దెచ్చి
చెలులకందిచ్చు మచ్చిక యెలర్ప
తొండంబుఁ జాచుచు గండస్థలంబుల
మూర్కొనుచుండును ముదము మీర
పూజొంపములఁ దెచ్చి పూసికతోఁ దన
సఖులకందిచ్చుఁ బ్రశస్తలీల
కర్ణపత్రంబులఁ గడువేడ్క నాడించి
చెలుల చెమ్మటలను తొలఁగఁ జేయు

గీ॥ తరులచాయల నిలుచుచు తనదు సఖుల
తోడ గ్రీడించు విహరించుఁ దొడరి విశ్ర
మించుఁ బలుమారు ప్రియులరమించి మించు
మత్తమాతంగనాథుండు మహిమ మీర॥

వ॥ మరియు నగ్గజేంద్రుండు

తో॥ తనకుంభంబులఁ బోలఁగ నేరక తరుణులకుచయుగ్మములు
బెనఁగొని పయ్యెదలందు డాగుననఁ బెంపారెడి కుంభములు
తనగమనంబున కోడుచుఁ బెరకాంతామణులంఘ్రులయందు
తనరనందియలు దాల్చెననఁగ సుందరయానము సెలువొందు॥

వ॥ ఇట్లు కరివిభుండు తన ప్రాణదైతలం గూడి స్వేచ్ఛావిహారం
బు సల్పుచు దైవాయత్తమగుటం జేసి చాలడస్సి దప్పిఁ
గొన్న సమయంబున నొక్కచో

కం॥ కరిణీనాథుఁడు గాంచెను
కరమలరెడు ఫుల్లజలజ కహ్లారంబున్
వరతటసుమనోవల్లీ
ధరణీరుహనిచయ శోభితంబగు సరసిన్॥

కం॥ కమఠోగ్రమీన నక్ర
ప్రముఖ జలచరాకరమున బహుమోదమునన్
విమలకమల కాండాహా
రమునఁ జెలఁగుచుండు ఘనమరాళము లెలమిన్॥

వ॥ ఇట్టి మనోహర కాసారంబుఁ బిలకించి గజేంద్రుండు వికసిత వదనారవిందుండై సేదఁదీర్చుకొననుత్సహించి సరోవరాభిముఖుండై చనుచుండ

ఉ॥ కమ్మనిపిల్లగాడ్పులు చోకాటముగా బ్రసరించె పద్మగం
ధమ్మన ఘ్రాణమొంతయు ఘనంబుగనుల్లసిలెన్ విహంగవ
ర్గమ్ముల సంకులారవము కర్ణయుగంబునుదన్పె భూరినా
దమ్ములు తేంట్లొనర్చుచు ముదంబొడఁగూర్చె కరీంద్రు
నెంతయున్॥

వ॥ అంత నగ్గజేంద్రుండు సపరివారుండై

మ॥ లహరీవర్గవిలాసభాసురము నుల్లాసప్రదంబున్ శ్రమా
పహమున్ శీతలతోయపూర్ణమును పద్మాకీర్ణమున్ ధారుణీ
రుహయుక్తోన్నత తీరమున్ నగు దుఁబొల్పొగ్గాంచు
కాసారమున్
మహోత్సాహముతోడ డాసి జలమున్ పానం
బొనర్చెన్ వెసన్॥



వ॥ పిమ్మట నగ్గజంబులన్నియును నొక్కుమ్మడి సరోవరంబున దుముక భుగభుగయను ధ్వనియును బుద్బుదంబులును బొడమె. భువనభయంకరములగు ఫూత్కారరవముల చేతను నక్రమీన కమఠాదులు భయమునొంది కల్లోలతనొందె. ఇట్లు వనచర జలచర కల్లోలమున జలంబులుప్పొంగె. కరినిచయవాలసంచాలనంబున జనించు జంఝానిలంబున తీరస్థధరణీరుహంబుల మూలంబులై ధరకొరగుచుండె నట్టిసమయంబున

తే॥ సరసినుండిగాంచెను గజమును జలచరమేప్పడనంత
త్వరితగతిని పటువిక్రమంబునను నురికి గజము నెడి చింత
యొకయింతైనను బూనక నక్రముయొడిసిపట్టె సేనుఁగును
సకలాంగములు వణకగ గుండెయు ఝల్లున కరిపెనఁగను॥

వ॥ విస్మయంబును భీతియును గని యంతలో ధైర్యంబూని కోపాటోపంబున జలంబును బుడబుడయను ధ్వనిజనింపఁ గలంచుచు దనవాలంబున మకరమును వేసె. అమ్మకరియు నుగ్రమానసమై తనకోరలతో కరిపాదంబులు పట్టువిడువక నఖంబులతో కరివాలంఁజీరుచు రక్తంబుఁగ్రోలుచు కల్లోలపరచుచుండెను.

ఉ య వి భా తి.
కరియుమకరంబు నిటులుకుతరజవంబునను
కరముకదనంబు నరమరవిడిచి సల్పన్
ధారఁగారుధిరంబు మడిఁబెరగా నురుకోపమతి
తరముగనుదుంపరలు నురగనభమంటెన్

హరిహరియు నెన్నఁగను గిరిగిరియుఁ బోరుగతి
దురమునొనరించె ధరఁ గరియుమకరంబున్
పరులిటులనల్పుదు రెదురమనుచు వేడుకను
సురలు పరికింపఁగను కరము నలరారెన్॥

వ॥ అయ్యవసరంబున రక్తధారాసమ్మేళనంబున సరోవర జలంబులు తోఁగరువన్నెఁ జెన్నారె. కెంపుసొంపారెడి యాజలంబును మింటనుండి వేల్పులు జిలకించి విస్మయపరీతచేతస్కులైరి. కరియు మకరియు తుల్యసత్త్వంబున నింగికి నెగయుచు మరల నీరంబునఁ గ్రుంకుచు, నిట్లనేక భంగుల సంగరంబు నొనర్చుచు నెంతకును మకరి వీడమిఁ గరీంద్రుండు తెగడొంది కుంగి దుఃఖమున మదము దొరంగియుండె

తో॥ నీరాటముతోఁ బోరాటంబున భూరిశక్తి నశియించ
ఘోరంబగు తనపూర్వకృతంబీ తీరునొంచెనని యెంచి॥

వ॥ కరీంద్రుండు మకరిచే పట్టుపడి దివ్యశతవత్సరంబులు పోరుఁగావించి, గెల్వఁజాలక యశక్యంబగు తనలావును మరచి పంచేంద్రియంబులు బంధించి, పూర్వజన్మఫలంబును దలంచుచు, రక్షకుండగు సర్వేశ్వరునిట్లు ధ్యానింపఁ దొడఁగె

నాట—త్రిశ్రగతి రూపకము.

పల్లి॥ విధిఁ గడువఁగ నాతరమా ॥విధి॥
అ॥ప॥ మదిఁదలఁపక నిజబలసంపన్నుఁడనై మరచిన నా ॥వి॥
బహుకరిణీనాథుఁడనై మత్తతతోఁ దిరిగితి మును
సహనంబించుక లేకను సంచరించియుంటిని నా ॥వి॥



వ॥ విధినిఁ గూర్చి తలంచుచు దుఃఖించుచు హరిని ధ్యానించుచు తదాయత్తచిత్తుండై విలపించుచు

హిందుస్థాని—కాఫి—త్రిశ్రజాతిరూపకము

పల్లి॥ ఎవరుగలరు నన్ను కృపను నేలుటకును పుడమిని
నా ॥కెవ॥
చర॥ దీనరక్షకుండె తలప దిక్కునాకు భువిని మనుప
నేమిసేతు నెటులనైతు స్వామికరుణ కలుగదాయె ॥ఎవ॥
ఆశలన్ని నీటఁ గలిపి దోషపాశబద్ధుఁడనై
గాసిఁజెందియున్నవాఁడ మోసమాయె బ్రోవఁగనా ॥కెవ॥

తో॥ ఘోరంబగు యీనీరాటంబును పోరాటంబున నొంచి
వారించెడువాఁడెన్నఁగ భువిలో వార్ధిశయనుఁడని యెంచి॥

వ॥ నిర్మలచిత్తుఁడై యోదేవాదిదేవా! మాంపాహి! మాంపాహి! యని మొరపెట్టుచు

కమాచి—చతురశ్రజాతి

ప॥ దేవదేవ నన్‌బ్రోవరావె యిల ॥దేవ॥
అ॥ప॥ పావనచరితా భక్తపోషకా
పాపము బాపుచు కాపాడవె నన్ ॥దేవ॥
చర॥ కలదందురు నిన్నిల దీనులయెడ
కలదందురు మునిగణములపాలన్
కనరావిట నీకరుణకుతగునా
ననుదరిఁజేర్పుమనాథ శరణ్యా ॥దేవ॥
సీ॥ దీనులందును సాధుమానవులందును
నన్నిదిశలయందు నలరునెపుఁడు
యోగులందును సువిరాగులందును చరా

చరములందును కేళిసల్పునెవఁడు
వేదవిదులయందు వేదంబులందును
బుధవరేణ్యులయందు బొలుచునెవఁడు
రాజులందును మునిరాజులందును హరి
హ్రిజ కావళియందు వరలునెవఁడు
గీ॥ కార్యకారణకర్తయౌ ఘనుఁడెవండు
మొదలుతుదిలేక నిత్యుఁడౌ సదయుఁడెవ్వఁ
డార్తజన పరిరక్షణాదక్షుఁడెవ్వఁ
డట్టివిభు సర్వభూతాత్ము నాత్మఁగొలుతు॥

వ॥ కరుణాసాగరా! నా మొరవినరాదా? దీనరక్షకుఁడవని మునుబల్కిరి. దేవా! నీకరుణకనర్హుఁడనా? శరణార్థిని. ఓ దీనబంధూ! నీహృదయారవిందంబున సుంతైనను నన్నుబ్రోవఁ దలఁపరాదా! తాళఁజాలనిఁక నన్నేవిధిఁబ్రోతువో కదా హరీ! యని మొరలిడుచు

కమాచి—చతురశ్రగతి

దేవారారా గావఁగనిలనన్ ॥దే॥
దరిశనమీయా దయతోరారా ॥దే॥
నను బ్రోతువీవే యని నమ్మితినిరా ॥దే॥
ఇందిరాలోలా సుందరాకారా
తాళఁగఁజాల దయఁజూడవేలా ॥దేవా॥

సీ॥ లోకంబులనుబ్రోచు లోకేశుఁడెవ్వఁడు
వెలయునెవ్వనిచేత విశ్వమెల్ల
సకలకర్మలకును సాక్షియౌ నెవ్వఁడు
నిత్యకర్మస్థియౌ నిపుణుఁడెవఁడు



భూరికళాయుతోదారుఁడెన్న నెవండు
ధర్మసంరక్షణాదక్షుఁడెవఁడు
సర్వముతానయౌ సర్వాత్ముఁడెవ్వఁడు
గనఁ జరాచరముల కర్తయెవ్వఁ
గీ॥ డట్టిమహనీయగుణశాలి నాదిదేవు
సరుననంతుని శాశ్వతుభద్రమూర్తి
నాపదనుఁబాపి బ్రోచుటకై సతంబు
నాత్మలోభజియింతు నేనమితభక్తి ॥

వ॥ ఇట్లు మొరపెట్టుచు మరియు

ముఖారి—ఆదితాళము.

నా మొరవినరా నగధరశౌరీ ॥నా॥
ఆదరించరా వేగము నేపడుబాధలుమాన్పఁగఁబంతమికేల ॥నా॥
నీరాటమునా పాదంబుల భీకరదంష్ట్రిద్వయిచే నీరంబున
పట్టి బాధపెట్టఁగఁదలఁపవు యిప్పట్టునఁగావుము శుభ
కర రవిశశినయనా భవహరణా కరుణాభరణ దురితహరణ
వేగమె ॥నా॥

సీ॥ మునిముఖ్యులెల్లరు ముక్తినిఁగనఁగోరి
భక్తితోఁగొల్తు రెవ్వానిపదము
సనకాదులెవ్వని సన్నిధి వసియింపఁ
గోరి చేరుదురు వైకుంఠపురము
నారదుండెవ్వని నామసంకీర్తన
మనిశంబుసల్పు భక్తాత్ముఁడగుచు
కిన్నరులెవ్వని కీర్తనంబునఁబార
వశ్యంబుఁగాంతు రపారముగను

గీ॥ సిరివసించు నెవ్వని ఘనయురమునందు
కౌస్తుభాభరణుండగు ఘనుఁడెవఁడు
ఆమహాత్ముని నాదిమధ్యాంతలయుని
చిత్తమందునఁగొల్తు రక్షించుకొఱకు ॥

బేహాగ్ — చతురశ్రజాతి

మనుజవరా నను బ్రోవఁగ మనసేలర యిదిమేరా ॥మ॥
కులముబలము చలముసుమ్ము తలఁపనీవె బలముసుమ్ము ॥మ॥
సతులుసుతులు గతముసుమ్ము హితమునీదు వ్రతముసుమ్ము ॥మ
సకలధనము సతముకాదు శాశ్వతంబు నీ స్మరణమె ॥మ॥
మదముగలుఁగ ముదముగాదు మది నిన్నన నదె సౌఖ్యము ॥మ॥
తోహ॥ ఆహా నేనోర్వఁజాల నీశ్రీమన్నార్తిహరుండీ భువిని
నూహింపఁగ శ్రీహరితక్కను వేరున్నారెవ్వరు దివిని
శక్తియుతోలఁగెను యుక్తియుఁ సడలెను సర్వాత్ముఁడు దిక్కనను
భక్తితో గొల్తును నాతని నేమది భావించుచు వీడకను
వ॥ అని మరియు
సీ॥ విందుగా కాననంబందుండ నేరకే
సరసీవిహారంబు సలుప నేల
చందనహింతాల ఛాయలనుండకే
వనజాకరముఁ జొరవలసెనేల
దశలక్షకోటి మాతంగనాథుండనై
దైన్యస్థితినిఁ బొంది వనర నేల
మించు వేడుకను రమించుచు సతులతోఁ
దిరుగక నిట్టిదుస్థితి యిదేల



గీ॥ ఏలవచ్చితినిటకు నేనేమిసేతు
నెవ్వరీ నక్రభయము హరించువార
లెవ్వరిని వేడుకొందు నేనింకమీఁద
దీనబాంధవ! నీవె నాదిక్కుసుమ్ము॥
వ॥ ఇట్లు పరిపరివిధంబుల విలపించుచు దీనవహించి మొర
లిడుచు

కమాచి — రూపకము చతురశ్రగతి

నన్నుబ్రోవరావదేర సన్నుతాంగ దీనపోష ॥న॥
కన్నతండ్రి క్రూరుడనే కనికరంబుబూనివేగ ॥న॥
కోపమేల పాపహరణ యాపదలను బాపనోపఁ
జాలవా కృపాలవాల మేలుగాదు తలపయిలను ॥నన్ను॥
ఇందిరేశ సుందరాంగ మందహాస పొందుగాను
సురలనేలు తెరఁగు భూరివరకృపాయుతుండవగుచు ॥నన్ను॥

తోహ॥ దీనబాంధవా యనాథుఁడను కృపఁబూని గావ
రమ్మికను
జ్ఞానవిహీనుఁడనని మదియందున సంకోచముఁబూనకను
లావునుదప్పెను ధైర్యముసడలెను యేవిధినిక పోరుదును
నీవేనాగతి భువియందున నికఁ గావరావె వేడెదను॥

వ॥ అని యీప్రకారంబునఁ గరీంద్రుండు నిక్కి నిక్కి బయ
లుంజూచుచు నీశ్వరాయత్తచిత్తుండై పాహి పాహి యని
మొరలిడుసమయంబున వైకుంఠుండుఁ బేరోలగంబుండె
నవ్వైకుంఠపురంబు

మ ఘు ర గ తి ర గ డ.

ధర్మనిర్మిత ప్రాకారంబులు । నిర్మలభూరి మణిద్వారంబులు

అంబరమార్గము నంటెడుకోటలు । డంబుమీరు పవనంబుల
బాటలు

పచ్చలుదాపిన రచ్చచావడులు । ముచ్చటఁగూర్చెడు
భూరిదేవిడులు

భాసురంబులగు వజ్రపుమేడలు । శ్రీసమృద్ధసువికాసపువాడలు

గానబగుమౌక్తిక ఘనతోరణములు । ధనరెడుమైరావణ
వారణములు

పవనజవములగు వరవాహనములు । నవిరళనిగమాంగమున
నిరవములు

ఫలపుష్పంబులఁజెలఁగెడి తరువులు । కలితజలంబుల
నలరెడు చెలువులు

శుకపికరుత సంశోభితవనములు । సకలంకోజ్వల యబలా
జనములు

సుగంధబంధుర యగరుధూపములు । సగణ్యనీరాజనపు
దీపములు

గరుడయక్షగణ కైవారంబులు । హరిహరియనియెడి
వరకీరంబులు

తనరారెడి గంధర్వగీతములు । మునిజననిర్జర.పుణ్యగీతములు॥

వ॥ గలిగి చెలువొందు. మరియు

సీ॥ ఏవనంబరసిన నింపుఁగూర్చెడు కల్ప
తరులసోయగము నచ్చెరువుగూర్చు



ఏమొకఁదిలకింప నెనలేని ఘన వసం
తాభ్యుదయంబు వృక్షములఁజెలఁగు
ఏశాఖఁగన్గొన్నఁ గేళివాయనిపల్కు
కీరసంఘములు జెన్నారుచుండు
ఎందుఁజూచినలసదిందుకాంతశిలావి
నిర్మితసౌధమానికములు రహిఁ

గీ॥ జెలఁగు వైకుంఠపురమున చిద్విలాస
పరులు విపులభోగైకతత్పరులు సిరులు
పరమమానీశ్వరులు పుణ్యపరులుగలిగి
చిరసుఖాస్పదమై యలరారు కరము॥

వ॥ ఇట్టి శ్రీ విలాసంబగు వికుంఠపురంబున భక్తపరాధీను
డగు హరి యిందిరాదేవితో మందస్మిత వదనారవిందుం
డై దేవగణంబులుగొలువ మహాఋషులు భజింప పేరోల
గంబుండె నట్టియవసరంబున

సీ॥ చెలువొప్ప చెంగటఁజేరి లక్ష్మీదేవి
యనుగత పదములనొత్తుచుండ
పుడమియునీలయు పొంతనునిల్చియు
నిరుగడల్ చామరాల్వీచుచుండ
చారుపీఠమున వాక్సతిపొందుగానుండి
శ్రుతిపేయముగఁబాడు శ్రుతులఁవినుచు
జలజసంభవుడు నిస్తుల భక్తియుక్తుఁడై
కేల్మోడ్చి నిలువ సత్కృపనుగనుచు

గీ॥ వేల్పుమూకలు జయము దేవేశయనుచు
చెంతనిలువఁగ హర్షసుస్వాంతుఁడగుచు

నారదాది మునీంద్రగణంబు కొలువ
కొలువుదీర్చి రమేశుండు వెలయునపుడు॥

వ॥ భక్తపరాధీనుండగు హరి కరివరు దీనాలాపంబులాకర్ణించి సంరంభంబున

వ॥ సిరికిన్ జెప్పడు శంఖచక్రయుగమున్ జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిన్ బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తఁడు వివాదప్రోద్ధత శ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై॥
(భాగ)

తో॥ కమలాక్షుఁడు సంరంభంబున కరిఁగావఁగ
నేగుచునుండఁ
గమలాప్రముఖులు విస్మయమున హరిగాంచి యబ్బురమునిండ
పైటచెరఁగు విడనాడక శ్రీహరి పరుగువారుచును జనఁగ
కైటభాహితుని వెంబడి సిరియును గడువడిఁ జనుటనుగనఁగ

వ॥ వైనతేయుండును సుదర్శన పాంచజన్య ప్రముఖాయుధంబులును నాశ్చర్యాందోళనంబులు బెనఁగొన శౌరి వెంబడిఁ జనుచుండ నవ్వైకుంఠపురవాసులెల్లరు నంబుజాక్షుఁ డెందేగఁ దొడంగెనో నిశ్చయింపఁజాలక తత్తరంబున నంతంత వెంబడి జనఁజొచ్చిరి. ఇట్లరుగుచుండు శౌరినిఁ బొడఁగని

తో॥ హరి చనుచుండెను బిరబిర నెవ్వరిఁ బరిపాలించుటకో యకట
ధరలో మానవులు దివిజుల బాధలఁ దల్లడమందిరో కటకట
రక్కసు లెవ్వరి దుష్టచిత్తులై యుక్కడఁగించిరో తలఁప
పక్కటికముతో నేబాలునికై యరిగె రక్షణము సలుప



వ॥ అనుచు సురలొండొరులు ప్రశ్నించుకొనుచు హరిపోకడ యిట్టిదని నిర్ణయింపనేరక ముకుళితకరాంజలులై

శా॥ హే దీనావన! హే దయాకర! హరీ! హే పక్షిరాడ్వాహనా
హే దైత్యాంతక! హే ముకుంద! వరదా! హే భక్తరక్షామణీ!
హే దూరీకృత పాపసంఘ! భవరాహిత్యప్రభావాఢ్య! శౌ
రీ! దామోదర పాలితాఖిల జగచ్ఛ్రేణీ! కృపన్ జూడవే॥

వ॥ అని వినుతింప విష్ణుండు వారి ప్రార్థనంబు లాకర్ణింపక బిరబిరఁ జని కరిమకరంబులు పెనంగు కమలాకరంబు డాసి నీరచరంబును సంహరింప నవక్రవిక్రమ ప్రభావాఢ్యమగు సుదర్శననామక చక్రంబును నియోగించె

తో॥ చక్రమపుడు నీరంబులఁ జొచ్చి యవక్రవిక్రమము
తోడ
నక్రజీవమును హరియించెను కరినాథు నార్తిఁ జెండాడ
జయజయయని సురసంఘములంతట సన్నుతించి పుష్పములు
వియత్పథంబునుండి గురియించిరి వేడుకతో భాష్పములు
కన్నులఁ జిందెను హర్షంబున నందున్న వారికెల్లరికి
సన్నుతాంగుఁడగు నా శ్రీహరి యాపన్నతఁ బాపెను గరికి॥

వ॥ ఇట్లార్తత్రాణపరాయణుండగు రమేశుండు మకరంబును ద్రుంచి కరిని విముక్తి నందించి పద్మసన్నిభంబగు తన కరతలంబున నా కరిమేను నిమిరి శ్రమంబుడిపెను. పిమ్మట దిక్కులు పిక్కటిల్ల విజయసూచకంబుగా పాంచజన్యంబు పూరించె నంత దేవదుందుభులు మొరసె. సురనికరంబు లత్యంత హర్షసమ్మిళిత హృదయులై రమానాథు నిట్లు కీర్తింపఁదొడంగిరి.

బేహాగ్ — చతురశ్రజాతి

పల్ల- దీనపోష మా దిక్కు నీవెరా ॥దీ॥
అ॥ప- దానవభంజనా దయఁజూడుమురా ॥దీ॥
చర- హరియని మొరగిన కరినిఁగాచితివి
వరదా నీదగు కరుణారసమున
నిరతము దీనులకురు సౌఖ్యంబులు
దొరకుటయరుదా పరిపాలింపుము ॥దీన॥

వ॥ దయాపయోధియగు హరి కరస్పర్శంబున గజంబు శాపం
బుఁబాసి రాజయ్యెను. మకరియు ముక్తిఁబొంది హూహూ
నామ గంధర్వుండై తన శృంగారతనువుఁగైకొని

కమాచి — ఆటతాళము

నమాస్తే సింధుదయాళో నమాస్తే సింధుదయాళో ॥న॥
సింధుదయాళో దీనదయాళో । దీనదయాళో దేవదయాళో ॥
నమాస్తే సింధుదయాళో ॥

వ॥ అని పాడుచుఁజనెను

సీ॥ ధాత్రి నింద్రద్యుమ్న ధరణినాథుఁడు మున్ను
ద్రవిడదేశంబునఁ దనరుచుండు
వైష్ణవముఖ్యుఁడై వరభక్తితోడను
నాతడు తపమును హరినిఁగూర్చి
సలుపఁగ నున్నతశైలంబుపై మౌన
వృత్తితో నుండెడివేళలందు
కలశజుండరుదేరఁ గనుకొనకున్న నా
నృపుని క్రోధంబున ఋషివరుండు



గీ॥ గరికులంబున జన్మంబుఁగాంచుమనుచు
శాపమిచ్చెను కుంభిదై జనవిభుండు
మకరితోడనుబోరాడె మానవులకు
విధివిధానంబుఁ దప్పింపవీలుకాదు॥

వ॥ అంత దేవబృందంబు ప్రమోదాంతరంగులై రమారమణు
మహిమను వినుతింపదొడంగిరి.

కమాచి — ఖండజాతి

పల్లవి॥ శాపము బాసెను కుంజరనాథునికిలలో ॥శా॥
అ॥ప॥ పరమాత్ముని మదిలో నిరతముస్మరియించినవరసుఖ
ములందుటబ్బురమా ధరయందున ॥శా॥
చరణములు- ఘనకరుణను నిత్యంబును దీనులనేలఁగ
వనజాక్షుఁడు తక్కను గననెవ్వరు గలరిల
సన్నుతచరితుఁడు జలజాక్షుఁడు పావనమతి
నెన్నఁగవశమాన విపన్నివారునిదయను ॥శాప॥

వ॥ అంత నింద్రద్యుమ్నుండు నిటలతటఘటిత కరాంజలుఁడై
హరిని వినుతింపఁజొచ్చె

బేహాగ్ — జులావ

దేవా సుకుమార సుందర భావమలర నిన్నుగొలుతు ॥దేవా॥
ఇందిరహృదయారవింద సుందరరవి నన్నుగాచు ॥దేవా॥
ఇనశశినయనాముకుంద ఘనకృపనన్నేలితిపుడు
వినుతింపగపశమెనిన్ను ననిశముస్మరియింతునింక ॥దేవా॥

వ॥ అంత నారదమహామునీంద్రుండానందకందళిత హృత్కమలుం
డై హరినిఁగూర్చి

జంఝూటి — చతురశ్రజాతి

లోకభరణనిన్ సాకఁగవేడెద ॥లో॥
నీమాయలుగన నెవరుగలరుగా (యిల) నెవరుగలరుగా ॥లో॥
సుందర వరముఖ యిందిరవరనీ వందితపదములు డెందము
నుంచర (నా) డెందమునుంచర ॥లోక॥

వ॥ అంత లోకేశ్వరుండను శౌరి యిందిరాసుందరీమణిని
దిలకించి

నాదనామక్రియ — ఏకతాళము

తరుణీ నీమనమున నెటుదలఁచితివో బిరబిరనేజన
నెటుదలఁచితివో ॥త॥
ఇందిర-నాథా యితరమెరుఁగనో నాథా నీపదములు
మదినానుచుఁ జనుదెంచితినో ॥నాథా॥

వ॥ కమలాలయనుడువు పలుకులకు హరి కరంబలరి పాంచ
జన్యంబు పూరించి గరుడారూఢుండై యిందిరాదేవితో
మందస్మితవదనారవిందుండై పరివారంబొనర్పు జయజయ
ధ్వానంబు లాకర్ణించుచు వికుంఠపురంబున కరిగెనని చెప్పి

సీ॥ కరివిభుమోక్షణకథ వినువారికి
వర్ధిల్లుసిరులు కైవల్యమబ్బు
కలుషముల్ బాయును దొలఁగుదుస్స్వప్నముల్
సౌఖ్యముల్ గల్గు యశంబుమించు
ప్రాతఃసమయముల భక్తియుక్తాత్ములై
పఠియించువారు శుభంబులంది
వెలయుచునుందురు విశ్వవిఖ్యాతమై
చెలఁగునీకథ మహీతలమునందు



గీ॥ ననుచు మధుసూదనుఁడు బ్రీతినానతిచ్చెఁ
గాన నియ్యది జనులకగణ్యసౌఖ్య
దంబగునటంచు శుకముని ధర్మసూతి
పౌత్రునకుఁజెప్ప నెంతయుఁ బ్రమదమొప్ప ॥

వ॥ మరియు నపరరాత్రంబున మేల్కాంచి శ్వేతద్వీపంబును
చిత్రకూటగిరిసిగిరికంధరంబులును నక్కాననంబును క్షీర
సింధువును నారదమహానిని సప్తఋషులను శింశుమార
చక్రంబును నజుని రుద్రుని యనంతుని వైనతేయుని గాం
చనగిరిని వైకుంఠంబును వైకుంఠుని భక్తియుక్తులై తలంచి
నవారలిహపరసౌఖ్యంబు లందుదురని తెల్పెను.

తోహరా॥ కరిగాచియు నామకరినిద్ర్యుంచిన వరదాయిదె
మంగళము
వరకరుణామతి ననుబ్రోచెడు శ్రీహరి నీకిదెమంగళము
కాంతామణిసన్నుత శ్రీనాథా గైకొనుమిదె మంగళము
దంతిదుఃఖపరిహారకశౌరీ దాసపోష మంగళము ॥

కన్నడ — తిశ్రగతి

మంగళంబు మంగళంబు మారసుందరాయిదేర ॥మం॥
రంగ దనుజభంగ భక్తసంగమామనోబ్జభృంగ
మంగళాంతరంగ యఘువిహంగద్విజతురంగ నీకు ॥మం॥
భూరిమూర్తి సాంద్రకీర్తి దారితార్తి భవనివర్తి
శూరా సంసారభయ నివారాగైకోరా యిదె ॥మం॥
మామకగురురాజరాయ మంగళమూర్తికిని నఖిల
ధీమతులగు సాధుజనుల దివ్యసదాశయములకును ॥మం॥

# గద్య

ఇది శ్రీ జానకీరమణ కరుణాకటాక్ష సంవర్ధమానానూన
కవిత్వ సమన్వితయునాఖండలవైభవ పరిపూర్ణ
డబీరుకుల కలశార్ణవ సుధాకరసన్నిభ
సూర్యనారాయణ పా బా బ్జ
బంభరియు గుణరత్న
భూషితయునగు
కాంతామణీ
కృతగజేంద్ర
మోక్షణ
నామక
హరికథ
యందు

సర్వంబును సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ మంళంమహా

రైతాంగ ముద్రణాలయము, శ్రీకాకుళం.

# శుద్ధపత్రము

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 6 | విఘ్నా | విఘ్నా |
| 4 | 20 | యుగ్మమునన్ | యుగ్మమునా |
| 8 | 10 | వెల్వడు | వెల్వడె |
| 11 | 12 | సకలాంగములు | సకలాంగంబులు |
| 14 | 21 | లోకేసు | లోకేశు |
| 16 | 21 | వసర | తసర |
| 20 | 20 | డిపిజులు | దితిజులు |